~~Andhra Jyothy~~ (Andra Jyoti)

May 11-1987

# అనంతపురంలో గణేశ్ దానిమ్మ

అనంతపురం, మే 10 (స్టాఫ్ న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో అనంతపురం జిల్లా ఎన్నో రకాల పండ్ల తోటలకు అనువైన వాతావరణం కలిగి వుంది. అయితె వర్షాభావంవల్ల, భూగర్భజలాలు తరిగిపోతుండడంతో ఆరేడు సంవత్సరాలుగా సాగులోవున్న ద్రాక్ష, చీనీ, నిమ్మ తోటలు ఎండిపోతున్నాయి. ఫలితంగా ఎంతో పెట్టుబడి పెట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో వున్నారు.

కాగా, స్థానిక ద్రాక్ష సలహాదారు శ్రీ సుధాకరరావు తుక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చే గణేశ దానిమ్మ తోటలను ఈ జిల్లాలకు పరిచయం చేయడం జరిగింది.

ఆయన జిల్లాలోని కొందరు ఔత్సాహిక రైతులను గణేశ దానిమ్మ ఎక్కువగా సాగుచేసే మహారాష్ట్రకు తీసుకు వెళ్ళి దానిని సాగు చేసే విధానం నిశితంగా పరిశీలింపజేశారు.

ఆ తర్వాత ఈ జిల్లాలో ఆ పండును రైతులచే ప్రోత్సాహింపజేశారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో సంవత్సరంలో కేవలం కొన్ని ఋతువులలోనే ఫలసాయాన్నిచ్చే దానిమ్మ అనంతపురం జిల్లాలో కేవలం రెండు నెలలు తప్ప తక్కువ పది నెలలలోను ఫలసాయాన్నివ్వడం గమనింపదగింది. అయితే రైతులు మొక్కలు ఎన్నుకోవడంలో జాగ్రత్త పడవలసిన అవసరం వుంది.

గత జనవరిలో దానిమ్మ సాగు చేసిన రైతులు ఈ మార్చిలో మొదట పంట తీసుకోవడం గమనించాల్సి వుంది.

అయితే ఈ మధ్య కలిగిన విద్యుత్ సరఫరా లోపంవల్ల రైతులు ఈ పంటకు సకాలంలో నీరు యివ్వక పోవడం వల్ల కాయలు పగిలి పోవడం జరిగింది.

దానిని కొందరు రైతులు తెగులుగా భావించడం జరుగుతున్నదని, అది తప్పు అభిప్రాయమని శ్రీ సుధాకరరావు తెలిపారు.

మార్కెట్‌లో దానిమ్మ ఎప్పుడు లభ్యం కాదో, ఆ సమయానికి పంట వచ్చేట్టు రైతులు శ్రమించవలసి వుంది.

అటువంటి సమయం లోనే దానికి మంచి ధర పలికే అవకాశం వుంటుంది.

దానిమ్మ పంట నాణ్యతకు కొన్ని హార్మోనులు అవసరమని, తగు సమయంలో ఈ హార్మోనులను ఉపయోగించడం వల్ల దిగుబడి బాగా పెరిగే అవకాశం వున్నదని శ్రీ సుధాకరరావు తెలియజేశారు.

అయితే ఆ పంటకు రైతులు సంవత్సరానికి రెండు సార్లకన్నా ఎక్కువ తీయరాదనేది ఆయన సలహా ఇచ్చారు.

అంతేగాక రైతులు దానిమ్మ పంటకు సమానమైన కాలవ్యవధిలో నీరు అందించవలసి వుంటుందని కూడా ఆయన అన్నారు.